క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



బాన్సువాడ: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహించే నిత్యాన్నదానం కోసం బాన్సువాడకు చెందిన గంగిశెట్టి నాగభూషణం గుప్తా రూ.1,11,116లను ఆలయ ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. పదేళ్లుగా అయ్యప్ప ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దత్త జయంతి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేత పూజలు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు శంకర్, గురువినయ్ పాల్గొన్నారు.

నర్సింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం..



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి అభివృద్ధి కోసం ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. రామారెడ్డికి చెందిన అమ్ముల సూర్యమోహన్, రాజ్యలక్ష్మీ దంపతులు రూ.25 వేలు, ముస్తాబాద్‌కు చెందిన తుమ్మ రమేష్, రాధ దంపతులు రూ.5 వేల విరాళాన్ని అందజేశారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు, పరందామాచార్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నేతల ర్యాలీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో ఆదివారం బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు సున్నం సాయిలు మాట్లాడుతూ.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన కోనేరు శశాంక్ బీజేపీలో చేరడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. అందుకే మండల వ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించి ఆయనకు స్వాగతం పలికామన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో గల శ్రీ రామాలయం అభివృద్ధికి రూ.15 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, ప్రధాన కార్యదర్శి మేకల రాములు, నాయకుల అరిగె నారాయణ, ఏ.శ్రీనివాస్, కె.మల్లేష్, పర్వయ్య, యాదగిరి గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బీబీపేట: శేరిబీబీపేట గ్రామానికి చెందిన చైత్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆమె ఆపరేషన్ నిమిత్తం లక్ష రూపాయల చెక్కును ఆమె తండ్రి లక్ష్మీనారాయణకు అందజేశారు. అంతే కాకుండా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి డాక్టర్లతో షబ్బీర్ అలీ మాట్లాడారు. షబ్బీర్ అలీకి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలియజేసింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, తదితరులున్నారు.

అయ్యప్పస్వాములకు పండ్ల పంపిణీ



బిచ్కుంద(జుక్కల్): బండారెంజల్ గ్రామానికి చెందిన మహ్మద్ షేక్ అలీ ఆదివారం బిచ్కుంద అయ్యప్ప స్వామి మందిరంలో దీక్ష స్వాములకు పాలు, పండ్లు అందజేశారు. మతాలు వేరైనా పూజించే దేవుడు ఒక్కడేనని.. వేర్వేరు పేర్లతో పూజిస్తున్నాము.. దేవునికి మానవులు అందరు సమానులేనని ఆయన అన్నారు. దీక్ష స్వాములకు పాలు, పండ్లు అందించడం..వారు స్వీకరించి ఆశీర్వదించడం సంతోషంగా ఉందన్నారు. అయ్యప్ప ట్రస్టు సభ్యులు మహ్మద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. అస్పత్వార్ అశోక్, ధన్నారం శ్రీనివాస్, ప్రేమ్, నౌషా నాయక్, రమణ, పండరి స్వాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కామారెడ్డి టౌన్: పట్టణంలోని 46వ వార్డులో ఆదివారం సీసీ రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ కోయల్‌కర్ కన్నయ్య ప్రారంభించారు. మున్సిపల్ ప్రత్యేక నిధులు రూ.5 లక్షలతో మందోళ్ల మైసమ్మ గల్లీలో రోడ్డు వేయించినట్లు తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శకుంతల, నాయకులు అశోక్‌రెడ్డి, రాజు, శంకర్, నర్సింలు తదితరులున్నారు.

స్థలం కేటాయించారు.. నిధులు మరిచారు

- అద్దె భవనంలో ఎక్సైజ్‌శాఖ కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు



దోమకొండలో ఎక్సైజ్‌శాఖ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం వద్ద ఎక్సైజ్ సిబ్బంది(ఫైల్)

దోమకొండ: దోమకొండలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గతంలో కొన్ని సంవత్సరాల పాటు అద్దె భవనంలో ఉండగా.. ఎనిమిది సంవత్సరాల క్రితం పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయాన్ని వారికి అప్పగించారు. కాని తిరిగి ఏడాది క్రితం ఆ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ డీఈ కార్యాలయానికి అప్పగించారు. దీంతో తిరిగి ఎక్సైజ్ కార్యాలయాన్ని అద్దె భవనంలోకి మార్చారు. ఎక్సైజ్ కార్యాలయానికి ప్రభుత్వం గ్రామ శివారులోని రైతు వేదిక వద్ద సర్వే నెంబర్-23లో పన్నెండున్నర గుంటల భూమిని కేటాయించారు. ఆ భూమిని ఇటీవల తహసీల్దార్ సంజయ్‌రావ్ ఎక్సైజ్ శాఖ అధికారులకు అందజేశారు. భూమిని అందించిన ప్రభుత్వం నిధులు కేటాయిస్తే సొంత భవనం కల నెరవేరుతుంది. దోమకొండ ఎక్సైజ్‌శాఖ కార్యాలయ పరిధిలో దోమకొండతో పాటు బీబీపేట, భిక్కనూరు, రాజంపేట మండలాలు వస్తాయి. ఆయా మండలాల పరిధిలో ఎక్సైజ్ దాడుల సమయంలో సేకరించిన కల్తీ కల్లు, మద్యం అద్దె భవనంలో నిల్వచేయడం ఇబ్బందిగా మారింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి త్వరగా భవన నిర్మాణం జరిగేలా చూడాలని ఎక్సైజ్ సిబ్బంది కోరుతున్నారు.

నిధుల కోసం వేచి చూస్తున్నాం



దోమకొండలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయానికి ప్రభుత్వం పన్నెండున్నర గుంటల భూమిని కేటాయించి మాకు అప్పగించారు. నిధులు కోసం వేచి చూస్తున్నాం. సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది. ప్రస్తుతం అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుంది.

– మధుసూదన్‌రావ్, ఎక్సైజ్‌శాఖ సీఐ, దోమకొండ

ప్రభుత్వం ఇకనైనా చర్చలు జరపాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా చర్చలు జరిపాలని, ఇప్పటికే సమ్మెతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం అన్నారు. సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చింతల లింగం మాట్లాడుతూ.. తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు పేస్కేల్ అమలు చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ హెచ్చరించారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే.వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు నళిని దేవి, నాగభూషణం, భగత్, రమణ, తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ



కామారెడ్డి క్రైం/మాచారెడ్డి: వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆ పార్టీ తరపున మంజూరైన ప్రమాద బీమా చెక్కులను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన కైరంకొండ శివరాములు, జక్కుల రాంచంద్రం ప్రమాదాల్లో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున మంజూరైన బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, నాయకులు నల్లవెల్లి అశోక్, శంకర్, గెరిగంటి లక్ష్మీనారాయణ, బూస శ్రీనివాస్, కృష్ణయాదవ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుబాసి నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలన్నారు. హైస్కూల్‌లలో వేసిన డిప్యుటేషన్లను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులు చెల్లించాలని, ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిత్ రాథోడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష మహా పాదయాత్రకు ఘన స్వాగతం



గోరక్ష మహా పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న అయ్యప్పస్వాములు

కామారెడ్డి అర్బన్: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీదత్త శరణానంద్ స్వామిజీ మార్చి 27న చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర ఆదివారం కామారెడ్డి పట్టణానికి చేరుకోగా ఘన స్వాగతం లభించింది. స్థానిక శిశుమందిర్ నుంచి కొత్తబస్టాండ్ గణపతి దేవాలయం వద్ద మహా పాదయాత్ర గోవుకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులు, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్, గోరక్షదళ్ కార్యకర్తలు, నాయకులతో అయ్యప్ప ఆలయం వరకు కొనసాగింది. పాదయాత్రలో పాల్గొంటున్న బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ.. గోరక్ష మహా పాదయాత్ర 2500 కిలోమీటర్లు పూర్తయిందని, ఇంకా 1400 కిలోమీటర్లు కొనసాగాల్సి ఉందన్నారు. పాదయాత్రకు ఎక్కడికి వెళ్లినా భారీ స్వాగతం లభించడం హిందువుల్లో వస్తున్న మార్పుకు సంకేతమన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఏ.నిత్యానందం, ప్రతినిధులు గోపాలకృష్ణ, గంగారెడ్డి, శ్రీకాంత్‌రావు, బీజేపీ నేత ఎం.శ్రీకాంత్, అయ్యప్ప ఆలయ ప్రతినిధులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి పనులు



ప్రొక్లెయిన్‌తో చదును చేసిన భూమి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద భూమి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. నెల రోజులుగా మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆలయం అభివృద్ధి కోసం విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలతో భూమి చదును చేస్తున్నారు. గతంలో ఆలయం వద్ద పంటలు సాగు చేసేవారు. భూయజమానులతో మాట్లాడి ఆలయం వద్ద మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గుంతలను పూడ్చివేశారు. ఆలయం వరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు బీటీ రోడ్డు మంజూరు చేయించారు. దీంతో బీటీ రోడ్డు పనులు సైతం కొనసాగుతున్నాయి.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆదివారం బాన్సువాడ డివిజన్ అంబేడ్కర్ సంఘం నాయకులు నెర్రె నర్సింహులు స్థానిక దళిత నాయకులతో కలిసి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని గ్రామస్తులను కోరారు. దళితులు భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించాలని అన్నారు. నాయకులు గైని రవి, మన్నె చిన్న సాయిలు, బేగరి సాయిలు, నాగభూషణం, పాపయ్య, పోచయ్య, రాములు తదితరులున్నారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల నియామకం



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ఆదివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు హనుమంతు ప్రవీణ్‌రావు తెలిపారు. గ్రామంలోని 5 బూత్‌లకు అధ్యక్షులుగా నీరడి భూమయ్య, నందికంటి రాజిరెడ్డి, కమ్మరి రాంచంద్రం, అమృత ఆంజనేయులు, వడ్ల చంద్రకాంత్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని వారికి సూచించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బాయికాడి ఆనంద్‌రావు, స్థానిక బీజేపీ నాయకులు ఉప్పుల సురేష్, బాషెట్టి ఆంజయ్య, హనుమాల భుజంగం, తదితరులు పాల్గొన్నారు.

యూసీమాస్ పోటీల్లో భిక్కనూరు బాలుర ప్రతిభ



భిక్కనూరు: ఢిల్లీలో యూనివర్సల్ కాన్సెప్ట్స్ ఆఫ్ మెంటల్ అర్థిమెటిక్ సిస్టమ్(యూసీమాస్–2024) అంతర్జాతీయ పోటీల్లో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన సోదరులు ఆదివారం అత్యుత్తమ ప్రతిభ చాటారు. తిరునగరి సంతోష్‌కుమార్–నిఖిల కుమారులైన చేతన్, వేదాన్ష్‌లు ఈ పోటీల్లో పాల్గొని చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. ఈ పోటీల్లో 30 దేశాల నుంచి ఆరు వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో చేతన్, వేదాన్ష్‌లు ఎనిమిది నిమిషాల్లో 200 గణిత సమస్యలను పరిష్కరించి నిర్వాహకులతో పాటు సభికుల మన్ననలు పొందారు.

మాదిగల దండోరాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంథని సామ్యెల్ మాదిగ

బాన్సువాడ : వచ్చే నెల 27న మాదిగల మరో దండోరా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగల దండోరా జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ అన్నారు. ఆదివారం బాన్సువాడలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని, అందుకు మాదిగలు ఉపకులాలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా పోరాటం చేస్తే ఎస్సీ వర్గకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, తీర్పు అమలుకు అడ్డుపడుతూ కొంత మంది స్వార్థపరులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. నేతలు సత్తిగారి లక్ష్మి, లావణ్య, సాయి, విజయ్, బాల్‌రాజ్, డాకయ్య, శివరాజ్, బంగారు రవి, గంగాధర్, రమేష్, శేఖర్, పవన్, దత్తు, సాయిలు, మహేష్ తదితరులున్నారు.

టైల్స్ పనులు ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలోని గంగపుత్ర ఆలయానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టైల్స్ పనులను ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట ఇవ్వడంతో ఆయన హామీ మేరకు పనులు ప్రారంభించామని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోసు శివ, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం కొమలంచలో ఆదివారం ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని సంఘం నాయకులు ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనంలో ముదిరాజ్ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం నాయకులు సాదుల సత్యనారాయణ, తదితరులున్నారు.

తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో నిత్యాన్నదానం



ప్రారంభిస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా శ్రీలక్ష్మి గోదా సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సహకారంతో వేంకటేశ్వర ఆలయం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సహకరిస్తున్న రైస్ మిల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. ఆలయ ధర్మకర్త పోచారం శంభూరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంతోష్, సభ్యులున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తా వద్ద ఇటీవల నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొలిక్కి రావడంతో ఇరు వైపులా వాహనాల రాకపోకలను ప్రారంభించారు. చౌరస్తా వద్ద గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టడంతో ఆ ప్రాంతంలో ఉన్న వర్తక, వ్యాపారాలు వెలవెలబోయాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టక ముందు జనాలతో చౌరస్తా కళకళలాడేదని, ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయి, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు కొనసాగుతుండడంతో తమ వర్తక, వ్యాపారాలు వెలవెలబోతున్నాయని స్థానిక వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారుల దృష్టి పద్మాజీవాడి చౌరస్తా నుంచి బాన్సువాడ వైపునకు వెళ్లే రహదారిపై పడ్డది. ఏదైనా వ్యాపారం పెడదామన్నా భూములు ధరలు ఆకాశాన్నంటడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

మున్నూరుకాపు మండల నూతన కార్యవర్గం



ఎన్నికైన మున్నూరుకాపు కార్యవర్గసభ్యులు



ఎన్నికైన ఆర్యక్షత్రియ కార్యవర్గ సభ్యులు

భిక్కనూరు: మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సమావేశమై అధ్యక్షుడిగా కల్లూరి సిద్దరాములు, గౌరవ అధ్యక్షుడిగా బల్యాల వెంకటనర్సింలు, ఉపాధ్యక్షుడిగా నిమ్మల తిరుమలయ్య, తాటిపల్లి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ముదాం శ్రీధర్, సహాయకార్యదర్శిగా కేతి బాల్‌రాజు, కోశాధికారిగా మన్నె మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా మన్నె నర్సింలు, హరి రవి, ముదాం బాబు, ముదాం స్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కల్లూరి సిద్ధరాములు మాట్లాడుతూ.. మండలంలో మున్నూరు కాపు కులస్తుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు.

ఆర్యక్షత్రియ మండల కార్యవర్గం ఎన్నిక

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల ఆర్యక్షత్రియ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీంరావు, ప్రధాన కార్యదర్శిగా వంజీర్ శంకర్‌రావు, సలహాదారులుగా వజీర్ రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భీంరావు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ధర్మ సంరక్షణలో తమవంతు పాత్ర పోషిస్తామన్నారు. ఎల్లవేళలా క్షత్రియ వర్గానికి అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

ఈ గుంతను పూడ్చేదెవరు..?



బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంత

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రమాదకర గుంత ఏర్పడింది. కొన్ని నెలలుగా రోడ్డుపై గుంత ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో బస్సులు, ఇతర ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అటు మున్సిపల్ అధికారులు కాని, ఇటు ఆర్టీసీ అధికారులు కాని పట్టించుకోవడం లేదు.అధికారులు స్పందించి పెనుప్రమాదం చోటుచేసుకోకముందే చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

సంక్షిప్తం

వాహనాల తనిఖీ



దోమకొండ: మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనంపై గల పెండింగ్ చలాన్లు కట్టించారు. ఎస్సై అంజనేయులు, ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

భిక్కనూరులో..



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద భిక్కనూరు పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను నమోదు చేసుకున్నారు.

18న సరస్వతి ఆలయ అష్టమ వార్షికోత్సవం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయ అష్టమ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేసినట్లు ఆలయ నిర్మాణకర్త పార్శి విఠల్ పటేల్, ప్రతినిధులు కోలాల సిద్దాగౌడ్ అర్చకులు దత్తురావులు తెలిపారు. ఈ నెల 18న ఉదయం 5 గంటల నుంచే ఉత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. సిద్దిపేట జిల్లా అనంతసాగర్‌కు చెందిన సరస్వతి మహాక్షేత్ర నిర్మాత కీ.శే అష్టకాల నరసింహ రామశర్మ ఆశీస్సులతో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి లక్షా 5 వేల 20 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వసతి గృహాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చడానికే నూతన మెనూను ప్రభుత్వం అమలులోకి తేవడం హర్షణీయమని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రవికాంత్‌స్వామి తెలిపారు. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ధనుర్మాసం మొత్తం కూడా విశేష గోత్రనామార్చన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.